క్లుప్తంగా

సూపర్ సిక్స్ హామీలను విస్మరించిన చంద్రబాబు



ఏలూరు కొత్త బస్ స్టాండులో పోస్టుకార్డు ఉద్యమం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నలభై ఏళ్ల సీనియారిటీ అని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడిచినా సూపర్ సిక్స్‌లోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీని అమలు చేయని కారణంగా ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం ఏలూరు కొత్త బస్టాండ్‌లో బస్సు ప్రయాణికుల ద్వారా పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులను కలిసి వారి విన్నపాలను ముఖ్యమంత్రికి అడ్రస్ చేస్తూ పోస్ట్ కార్డులు ప్రయాణికులతో రాయించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంక రామ్మోహన్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ గౌడ రంగబాబు, దండుబోయిన చంద్రశేఖర్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

రన్నింగ్ ట్రాక్ రక్షణకు చర్యలు తీసుకోండి

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని రన్నింగ్ ట్రాక్ గోతులమయం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అథ్లెట్లు వేడుకుంటున్నారు. ప్రతిరోజూ స్థానిక ఖేలో ఇండియా సెంటర్ అథ్లెట్లతో పాటు నగరంలోని పలువురు క్రీడాకారులు ట్రాక్‌పై రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ట్రాక్‌పై పలువురు వ్యక్తులు మోటారు బైక్‌లతో పయనించడం వల్ల ట్రాక్ పాడయ్యింది. పలుచోట్ల గోతులు పడ్డాయి. దీంతో అథ్లెట్లు సాధన చేసేందుకు భయపడుతున్నారు. గోతులమయమైన ట్రాక్‌పై సాధన చేయడం వల్ల పాదాలు, కాళ్లకు గాయాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. క్రమం తప్పకుండా సాధన చేయకపోతే పోటీల్లో విజయం సాధించలేమని గుర్తు చేస్తున్నారు. దీనివల్ల తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా బాధిస్తోందన్నారు. నగర వాసులు, క్రీడాభిమానులు, వాకర్స్ ట్రాక్ గోతులమయం కాకుండా సహకరించాలని వేడుకుంటున్నారు.

అక్షరాస్యతపై అవగాహన సదస్సు

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ వి.శ్రీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యపై మహిళల్లో అవగాహన మరింత పెరగాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులైనప్పుడే సమాజంలో అసమానతలు తగ్గుతాయన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రత్యేక చొరవతో అక్షరాస్యతపై మహిళల్లో అవగాహన పెంచి, విద్యావంతులను చేయాలన్నారు. ఈ అవగాహన సదస్సులో డ్వాక్రా సంఘాల సహాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రిగా జిల్లాకు తొలిసారిగా వచ్చిన నాదెండ్ల మనోహర్‌ను కలుసుకుని పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ఏలూరు జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తాలూకా అధ్యక్షుడు జి.శ్రీధర్ రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి ఈ.నరేంద్ర. జిల్లా, తాలూకా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

చింతలపూడి రోడ్డు గోతులమయం

- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- మరమ్మతులైనా చేపట్టాలని వేడుకుంటున్న ప్రయాణికులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



చొదిమెళ్ల వద్ద ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్న చోదకులు



ఛిద్రమైన ఏలూరు- చింతలపూడి రహదారి

ఏలూరు రూరల్ : ఏలూరు – చింతలపూడి రోడ్డు చొదిమెళ్ల పరిసరాల్లో గోతులమయంగా మారింది. అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. రోడ్డుపై ప్రయాణం వాహన చోదకులు ప్రాణ సంకటంగా మారింది. గోతులు తప్పించే ప్రయత్నంలో మోటార్ బైక్‌పై వెళుతున్న చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఆటో డ్రైవర్లు గోతులు తప్పించలేక అవస్థలకు గురవున్నారు. ప్రజలు ఆటోల్లో ప్రయాణించేందు కూడా భయపడుతున్నారు. భారీ వాహనాల డ్రైవర్లు సైతం అత్యంత జాగూరతతో రోడ్డుపై ప్రయాణించడం రోడ్డు దుస్థితి తెలియజేస్తోంది. రోడ్ల పనితీరు చూస్తుంటే కూటమి ప్రభుత్వం పనితీరు ఏరు దాటగానే తెప్ప తగలెట్టేలా ఉందని ఏలూరు నగరం పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రోడ్లుకు మరమ్మతులు చేపడతామంటూ ఎన్నికల్లో చేసిన హామీలు తుంగలో తొక్కారని అంటున్నారు. రోడ్ల అభివృద్ధి ఎప్పుడు చేపడతారని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్ల అభివృద్ధి చేయలేదంటూ ఆందోళన, ధర్నాలు చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు ఏమయ్యారంటూ నిలదీస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో తెలుసుకోవాలంటూ కూటమి నాయకులు చొదిమెళ్ల వద్ద ప్రమాదకరంగా మారిన ఏలూరు చింతలపూడి రోడ్డు పరిశీలించాలని సూచిస్తున్నారు.

ప్రధాన రోడ్డు దుస్థితి

రోడ్డుపై ప్రతిరోజూ వందలాది భారీ వాహనాలు, ఆటోలు, మోటార్‌సైకిళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఈ రోడ్డుకు కనీసం మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోలేదు. కొద్ది నెలలుగా రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రోడ్డు మార్జిన్ కోతకు గురయ్యింది. దీంతో వేగంగా ప్రయాణిస్తున్న మోటార్ బైక్ చోదకులు జారి పడిపోతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి ఏలూరు వస్తున్న చోదకులకు రోడ్డు దుస్థితి తెలియకపోవడంతో గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల భార్యాభర్తలు మోటార్‌సైకిల్‌పై పయనిస్తూ గోతుల్లో పడి తీవ్ర గాయాలపాలయ్యారు.

లైట్లు వెలగవు, ఇండికేటర్లు లేవు

ఈ రోడ్డు పక్కల వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో రోడ్డు చిమ్మచీకటిగా మారిపోతోంది. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, వంపు ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ అధికారులు కనీసం ఇండికేటర్లను కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని ప్రాంతాల్లో ఇండికేటర్లు ఉన్నా అవి చోదకులకు కనిపించడం లేదు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాల హెడ్‌లైట్ వెలుగుల వల్ల రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, గోతులను వాహనచోదకులు గుర్తించలేకపోతున్నారు. ఫలితంగా ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డుపై ప్రయాణం భయమేస్తోంది



ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే చాలా భయమేస్తోంది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో మోటార్‌సైకిల్ గోతుల్లో పడి వాహనం హ్యాండిల్ పట్టు తప్పుతోంది. ఈ కారణం వల్లనే చాలా మంది రాత్రివేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం గోతులనైనా పూడ్చాలి. రోడ్డుకు రెండు పక్కల ఇండికేటర్లు ఏర్పాటు చేయాలి.

– ఎండీ సుభాని, ఏలూరు

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలైనా రోడ్లపై కనీసం గోతులను కూడా పూడ్చలేదు. గోతులు పూడ్చడానికి కూడా పాలకులు నిధులు కేటాయించలేకపోతున్నారు. రోడ్డును అభివృద్ధి చేసే వరకూ గోతులను ఇలానే వదిలేస్తే ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే ఎంతో మంది వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యారు.

– కె.శ్రీనివాసరావు, ఏలూరు

విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వసతి గృహం లోపల పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వసతి గృహాల్లోని విద్యార్థుల చదువు,ఆరోగ్యం పట్ల నిర్వాహకులు శ్రద్ధ వహించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఏలూరు, కొవ్వలిలోని సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత వసతి గృహాలను గుండుగొలను, భీమడోలులోని బాలికల సంక్షేమ వసతి గృహాలను, ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లి లోని శ్రీ సత్య సాయి అనాథ బాలికల వసతి గృహాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సంక్షేమ వసతి గృహాల్లోని బాల, బాలికలకు అందిస్తున్న వసతులుపై, ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుండుగొలను, భీమడోలు, కొవ్వలిలోని వసతి గృహాల్లో స్నానాల గదులు, వసతి గదులు చాలా అధ్వానంగా ఉన్నాయని, వాటిని తక్షణం మరమ్మత్తులు చేయించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యార్థులకు అందించే వసతులపై, ఆహార నాణ్యత విషయాల్లో అలసత్వం వహించరాదన్నారు. బాల బాలికలకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని లేదా 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే తగిన న్యాయ సహాయం అందుతుందని తెలిపారు.

శాస్త్రీయ విద్యా సాధనకు పీడీఎస్‌యూ పోరాటం



పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 24న నిర్వహించనున్న 50 వసంతాల (అర్ధ శతాబ్ది) ఉత్సవాలను జయప్రదం చేచాలని ఆ సంఘ జిల్లాల్ల అధ్యక్షుడు కాకి నాని కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని వివిధ కళాశాలల్లో ఆయా కళాశాలల పీడీఎస్‌యూ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అర్ధ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 1974 అక్టోబర్ 12, 13 తేల్లో పీడీఎస్‌యూ ప్రథమ రాష్ట్ర మహాసభలు ఇదే ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా అనేక నిర్బంధాల మధ్య కొనసాగాయని ఆ మహాసభలు ఆనాడు ఉన్న విద్యార్థి లోకానికి ఒక దిశానిర్దేశం చేశాయని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు శాస్త్రీయ విద్యా సాధనకై పీడీఎస్‌యూ అలుపెరగని పోరాటం చేస్తోందని, ఈ పోరాటంలో అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న 50 వసంతాల ఉత్సవాల్లో విద్యార్థి లోకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నాని ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల, డీఎల్‌టీసీ ఐటీఐ కళాశాలలో అర్ధ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, ఏ.శాంతి కిరణ్, వి.విశ్వతేజ, కె.ఫణిశ్రీ, సీహెచ్ ఆశాలత, పలు కళాశాలల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించాలి



బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ పుష్పలతకు వినతి పత్రం అందజేస్తున్న కడుపు కన్నయ్య తదితరులు

ఏలూరు (టూటౌన్): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు మాసాలు కావస్తున్నా చేతి వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలూ చేపట్టలేదని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కడుపు కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ చేతి వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర పిలుపులో భాగంగా మంగళవారం చేతి వృత్తిదారుల సమాఖ్య ఏలూరు జిల్లా సమితి నాయకులు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ పుష్పలతకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర జనాభాలో 30 శాతం వరకు ఉన్న చేతి వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్లో 25 శాతం నిధులు కేటాయించాలని కన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా చేతి వృత్తిదారులకు రూ.5 లక్షలు తగ్గకుండా 50 శాతం సబ్సిడీతో రుణాల అందించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. 50 ఏళ్లు నిండిన చేతివృత్తిదారుల్లో అర్హత ఉన్న వారికి పెన్షన్ సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. ఈడీని కలిసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బళ్ల కనకదుర్గారావు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు(70) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఏలూరు జన్మభూమి పార్కు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న వృద్ధుడిని రెండు నెలల క్రితం పోలీసులు జీజీహెచ్‌లో చేర్పించారు. మృతుని వివరాలు తెలియలేదని, మృతదేహాన్ని మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు. మృతుని బంధువులు, వివరాలు తెలిసిన వారు ఏలూరు సర్వజన ఆసుపత్రి ఆర్ఎంవోను సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఎస్ఏ పోస్టులు మంజూరు చేయాలని వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ నగర పాలక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయడానికి తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని ఏపీటీఎఫ్ నగర శాఖ నాయకులు ఏలూరు ఎంఈవో -1 అల్లూరి రవిప్రకాష్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను మంజూరు చేయించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు తెరవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నగరశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్మా ఆనందకుమార్, అబ్బదాసరి శ్రీనివాసరావు, నగర ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, రూరల్ అధ్యక్షుడు ఎన్వీ రామశేష్ కుమార్ పాల్గొన్నారు.

ఏలూరు తూర్పుకాపు సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగర తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం నూతన నగర కమిటీ ఎన్నికలు త్వరలో నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని పరిరక్షణ కమిటీ చైర్మన్ గుడిదేశి శ్రీనివాసరావు కోరారు. ఏలూరులో మంగళవారం సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగర కమిటీ, యువత, ఇతర విభాగాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర కమిటీ, అనుబంధ కమిటీలకు అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి పదవులకు ఆసక్తి కలిగిన వారు ఈనెల 23 నుంచి 30తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంఘం పెద్దలు బంక ప్రసాద్, కమిటీ చైర్మన్ శ్రీనివాసరావుకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలి



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో మాట్లాడుతున్న డీఆర్వో డి.పుష్పమణి

ఏలూరు(మెట్రో): ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను ఆదరించి వారిని గౌరవించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి మీటింగ్ హాల్లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలువైపుల నుంచి సుమారు 150 మంది వయోవృద్ధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టాన్ని వివరించారు. వయోవృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలన్నారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వయోవృద్ధుల సమస్యలను, మెయింటెనెన్స్ తదితర అంశాలను ఆర్డీవోలు చూస్తారన్నారు. ఈ సందర్భంగా 15 మంది వయోవృద్ధులను డీఆర్వో సత్కరించారు. వయోవృద్ధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సీనియర్ సిటిజన్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ యంపరాల నారాయణమూర్తి, కార్యదర్శి కుక్కునూరి రామచంద్రరావు, స్టేట్ వైస్ పెసిడెంట్ సాగిరాజు జానకీరామరాజు, శివరామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ రాజు, ఎస్.అబ్రహం, సెట్‌వెల్ కె.ప్రభాకర్ రావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్, పలువురు వయోవృద్ధుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యాపారాలపై దృష్టి సారించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు వ్యాపారాలపై దృష్టి సారించి, రాణించాలని, ఆ దిశగా వారిని ప్రోత్సహించేందుకు ఇన్నోమాన్ ఒక కీలకమైన వేదిక అని మైక్రోలింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ డైరెక్టర్ వి.గోవిందరావు అన్నారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇన్నోమాన్ 2 కే 24 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవిందరావు, ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అభ్యర్థులకు లభించే నెట్ వర్కింగ్ అవకాశాల ప్రాముఖ్యతను, పరిశ్రమ నిపుణులు, తోటి వారితో కలిసి వారి భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకునే అవకాశాలపై అవగాహన కలిగించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన పీ విజయవాణి ఇన్నోమాన్ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపతి పీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధ్యాపకురాలు హెప్సిబా ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. నిర్వాహకులను వైస్ ప్రిన్సిపల్, క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, పీజీ డైరెక్టర్ సిస్టర్ సుశీల వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు అభినందించారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల వేతన బకాయిలు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): క్లాప్ ఆటోల డ్రైవర్లకు బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, జనవరి నుంచి బకాయి ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ నగదును ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ ఏలూరు నగరపాలక సంస్థ క్లాప్ ఆటోల డ్రైవర్లు స్థానిక వంగాయ గూడెం సెంటర్లోని మున్సిపల్ వెహికల్ డిపో వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు, చెత్త సేకరణకు ఎంతో శ్రమ పడుతున్న క్లాప్ ఆటోల డ్రైవర్లు మూడు మాసాలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. క్లాప్ ఆటోల డ్రైవర్ల సమస్య పరిష్కరించకుంటే నవంబర్ 4 నుంచి విధులు నిలుపుదల చేసి నిరవధిక సమ్మె చేపడతామని ఆయన తెలిపారు. ధర్నా అనంతరం మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌కు తమ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. జాన్‌బాబు యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రాజు, గణేష్, పుష్పరాజు, గణేషు, హరీష్ పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు (టూటౌన్): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఏలూరు డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏలూరు కలెక్టరేట్‌కు విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఏలూరు జిల్లా వినియోగదారుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేసినట్లు సెడ్కాస్ అధ్యక్షుడు న్యాయవాది కట్టా సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు లేకపోవడంతో తనిఖీలు నిర్వహించడం లేదని వెంటనే అధికారులను నియమించాలని కోరామన్నారు. లీగల్ మెట్రాలజీ ఆఫీసులో సిబ్బంది కొరత కారణంగా తనిఖీలు నిర్వహించడం లేదని తెలిపామన్నారు. జిల్లా కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోమన్నారు. వినియోగదారుల చట్టం-2019పై పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె. రామచంద్రరావు, సహాయ కార్యదర్శి సీపీఎస్ రామానుజాచార్యులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె. ప్రసాద్ ఉన్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మ సంయమ యోగము శ్లోకాలపై కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11 గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించడానికి ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులకు వచ్చే డిసెంబర్ 1న, ఆదివారం మొగల్తూరులోని రామాలయంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏలూ రు జిల్లాకు సంబంధించి డిసెంబర్ 8వ తేదీ ఆదివారం జంగారెడ్డిగూడెం కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. జూనియర్ విభాగంలో 6, 7 తరగతుల విద్యార్థులకు, సీనియర్ విభాగంలో 8,9 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి విభాగానికి సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1000, రూ. 750, రూ. 500 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పోటీలు కూడా ఆయా తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9492941754 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

పత్రికా ప్రకటన

[illegible] జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో...ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా

O.S.No.46/2022

మధ్య :
మాగంటి శ్రీ దేవి ...... వాది
మరియు
ఉయ్యూరు వీర రాఘవులు ..... ప్రతివాది

[illegible]

ఏలూరు, తేది:22.10.2024

కమతం సుబ్బారావు (బాల)
అడ్వకేటు - ఏలూరు
సెల్ : 98481 43317

పత్రికా ప్రకటన

[illegible] జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో...ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా

I.A.No.732/2022 in O.S.No.46/2022

మధ్య :
మాగంటి శ్రీ దేవి ...... పిటీషనరు/వాది
మరియు
ఉయ్యూరు వీర రాఘవులు ..... రెస్పాండెంట్/ప్రతివాది

[illegible]

షెడ్యూలు ఆస్తి వివరము

[illegible]

ఏలూరు, తేది:22.10.2024

కమతం సుబ్బారావు (బాల)
అడ్వకేటు - ఏలూరు
సెల్ : 98481 43317

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	19
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - తిరుపతి	16.00	4830	27

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, సంస్మరణ, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

ఏలూరు

90102 23729
95055 08399
79955 66352

Office mail : tpgadvt@gmail.com